క్లుప్తంగా

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



వించిపేట(విజయవాడపశ్చిమ): ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని 49వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తు నగరపాలక సంస్థ ఆధ్వర్యాన చిట్టినగర్, ప్రైజర్‌పేటలో కళాజాత ప్రదర్శన జరిగింది. ప్లాస్టిక్ సంచులు, బాటిళ్ల వ్యర్థాలతో పర్యావరణానికి కలిగే ప్రమాదం, వాటితో వ్యాపించే వ్యాధులపై కళాకారులు తమ ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోవడంతో ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం, నగరపాలకసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీగణపతి హోమం



విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థమహాస్వామి, ఉత్తరాధికారి విదుశేఖర భారతి స్వామి ఆదేశంతో 25 రోజులుగా నిర్వహిస్తున్న లక్షమోదక లక్ష్మీగణపతి హోమం ఆదివారం ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పండితులు హవన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం మహాగణపతికి వేదోక్తంగా గణపతిపూజ, గణపతి అధ్వర్యశీర్షోపనిషత్ పారాయణం, సహస్ర నామార్చన నిర్వహించారు. మోదక పూజ అనంతరం గురువందనం మంత్రపుష్పం, 129 సుగంధ ద్రవ్యాలతో పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, గందూరి చంద్రమౌళీ పాల్గొన్నారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



విజయవాడస్పోర్ట్స్: మేకల విజయసారథి మెమోరియల్ రెండో జాతీయ కరాటే పోటీల బ్రోచర్‌ను విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ వడోక్కై కరాటే డో అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త మేకల లక్ష్మీప్రసాద్ విచ్చేశారు. విశాఖపట్నంలో డిసెంబర్ 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోలా ప్రతాప్, జి.ఆనందబాబు తెలిపారు. పోటీలకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సతీష్ వ్యవరిస్తారని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

మహాకవి జాషువా అందరికీ ఆదర్శం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాకవి గుర్రం జాషువాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గ్రంథాలయాధికారి కె.రమాదేవి సూచించారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం, గుర్రం జాషువా జయంతి కార్యక్రమం జరిగింది. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సామాజిక పరిస్థితులపై జాషువా గొప్ప రచనలు చేశారన్నారు. ఆయన రచించిన గబ్బిలం, ఫిరదౌసి పేరు ప్రఖ్యాతులు తెచ్చాయన్నారు. జాషువా రచనలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా చేర్చారని తెలిపారు. ఆయన రచనలు చదివి అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బెస్ట్ టీచర్ అవార్డు'కు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరల్డ్ టీచర్స్ డే పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన అత్యుత్తమ క్రమశిక్షణతో ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గుర్తించి బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డ్– 2024తో సత్కరించనున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎన్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులను వచ్చేనెల 13వ తేదీన హైదరాబాద్‌లో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు వచ్చేనెల 5వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

రీ ఎన్యూమరేషన్ చేయండి

- వరదతో మునిగిపోయిన ఇంటికి రూ.50వేలు, ఆటోలకు రూ.25వేలు ఇవ్వాలి
- ధర్నాచౌక్‌లో ఇఫ్టూ ధర్నా



అలంకార్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఇఫ్టూ, సీఐటీయూ నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల్లో ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వ నామమాత్రపు పరిహారం ప్రకటించిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ అన్నారు. అది కూడా సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో రీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో ఇఫ్టూ ఆధ్వర్యాన వరద పరిహారం రెట్టింపు చేయాలని కోరుతూ ధర్నా జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే 2.87లక్షల ఇళ్లు వరదలో మునిగిపోయాయని, వరద నష్టం రూ.6,800కోట్లుగా అంచనా వేసిందన్నారు. కానీ పరిహారం చెల్లింపులో కేవలం రూ. 600కోట్లతో సరిపుచ్చడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అందులోనూ దాతలే రూ. 400 కోట్లు ఇచ్చారని చెప్పారు. దాతలు ఇచ్చిన విరాళాలకు ప్రభుత్వం నామమాత్రంగా జోడించి చేతులు దులుపుకుందన్నారు. ఇది అత్యంత దుర్మార్గమని విమర్శించారు. ఎన్యూమరేషన్‌కు ఇతర జిల్లాల అధికారులను కేటాయించి పథకం ప్రకారం లబ్ధిదారులను కుదించారన్నారు. ఇళ్లు, ఆటోలు మునిగిపోయి కార్మికులు జీవనాధారం కోల్పోయారన్నారు. ఆటోలను అన్నింటినీ నమోదు చేయలేదని, చేసినా నో రిపేర్ అని రాసి పరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు.

ప్రభుత్వం తక్షణమే తిరిగి వరద బాధితుల గణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితులందరికీ పరిహారం పెంచి ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సీ హెచ్ శ్రీనివాస్, ఏఐసీటీయూ నాయకులు ఎస్ డీ. సలీం మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఆటోకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుడమేరు వరదల్లో మునిగిపోయిన ఇళ్లకు రూ.50వేలు, ఆటోలకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) డిమాండ్ చేసింది. ధర్నాలో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ముని శంకర్, ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఆటో సంఘం నాయకులు కె.దుర్గారావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాబు తీరును అసహ్యించుకుంటున్నారు

- రాజకీయ లబ్ధికే కుటిల రాజకీయం
- వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తిరుపతి లడ్డు ప్రసాదం విషయంలో సీఎం చంద్రబాబునాయుడు తీరును దేశంలోని ప్రతి హిందువు అసహ్యించుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్ విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి కుటిల రాజకీయాలకు చంద్రబాబు పాల్పడుతున్నాడని ఆరోపించారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. నాలుగు నెయ్యి ట్యాంకర్లను వెనక్కు తిప్పి పంపించామని ఈఓ స్పష్టంగా చెప్పారన్నారు. కానీ చంద్రబాబు మత రాజకీయాలు చేస్తుంటే కూటమి నేతలు వేడుక చూస్తున్నారన్నారు. నెయ్యి నాణ్యత లేకపోతే ఈఓ దాన్ని చెప్పాలి కానీ టీడీపీ కార్యాలయంలో ఉన్న వ్యక్తులు బయట పెట్టడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. జూలై 23న రిపోర్ట్ వస్తే సెప్టెంబర్ వరకూ దానిని ఎందుకు బయట పెట్టలేదన్నారు. నాలుగు ట్యాంటర్లను వెనక్కు పంపి షోకాజ్ నోటీసు ఇచ్చామని ఈఓ చెప్పారని, 19 తేదీన వచ్చిన రిపోర్ట్ గురించి ఈఓ చెప్పకుండా టీడీపీ కార్యాలయంలో విడుదల చేశారన్నారు. టీటీడీ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ టీడీపీ కార్యాలయానికి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అసలు లడ్డులో కల్తీ నెయ్యి వాడలేదని 20వ తేదీన ఈఓ చెప్పారని, కానీ చంద్రబాబు కుట్రలతో ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యేలా సాక్ష్యాలతో సహా మాజీ సీఎం జగన్ మీడియా సమావేశంలో చెప్పారన్నారు. టీటీడీ చరిత్రలో నెయ్యి శాంపిల్ మైసూర్‌లో చెక్ చేయిస్తున్నారని, కానీ ఇప్పుడు కుట్రలో భాగంగానే గుజరాత్‌లో చేయించారని ఆరోపించారు. దీనికి కూటమి నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఏదో విధంగా బయట పడాలని తన అనుకూల అధికారులతో చంద్రబాబు సిట్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల సమయంలో త్రిపాఠి పనితనం పల్నాడులో ప్రజలు చూశారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విచారణకు ఎందుకు చంద్రబాబు భయపడుతున్నారో చెప్పాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి తిరుమల దర్శనానికి వస్తుంటే పోలీసులు నోటీసులు ఇస్తారా? అని ప్రశ్నించారు. నిత్యం గోపూజ చేసే వ్యక్తి హిందువు కాక మరేమవుతారన్నారు. పార్టీ జెండాలు, కండువాలు, ప్లకార్డులు దేవాలయాలకు తీసుకెళ్లటం ప్రాయశ్చిత్తం దీక్ష లక్ష్యంగా ఉందన్నారు. గొడ్డు మాంసం తినవచ్చు అని చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీనికి ఏమీ సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

దసరాకు ముస్తాబవుతున్న 'పశ్చిమ' ఆలయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీ గంగానమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబవుతుంది. అక్టోబర్ 3నుంచి 12వ తేదీ వరకు అమ్మవారి ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామని శ్రీదుర్గా గాయత్రి అర్చక యాజ్ఞిక పురోహిత సేవా సంఘం అధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. ఉత్సవాల్లో అమ్మవారికి విశేష అలంకారాలతో పాటు ప్రతి నిత్యం కుంకుమార్చన జరుగుతుందన్నారు.

3న శ్రీబాల త్రిపుర సుందరీదేవి, 4న శ్రీగాయత్రిదేవి, 5న శ్రీఅన్నపూర్ణాదేవి, 6న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, 7న శ్రీమహాచండీదేవి, 8న శ్రీమహాలక్ష్మీదేవి, 9న మూలానక్షత్రం శ్రీ సరస్వతిదేవి, 10న శ్రీదుర్గాదేవి, 11న శ్రీమహిషాసురమర్ధినిదేవి, 12న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయానికి రంగులు వేయడం పూర్తైందని, భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఫౌండర్ సభ్యుడు బసవ కాశీ విశ్వనాథ్, గౌరవ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్ పేర్కొన్నారు.



దసర ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి, విజయబాబు తదితరులు

3 నుంచి పోలేరమ్మ ఆలయంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పంచాయతీ పరిధిలోని ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఉత్సవాల్లో అమ్మవారు తొలి రోజు 3న పోలేరమ్మ స్వర్ణకవచ అలంకారంలో, 4న శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి, 5న శ్రీగాయత్రీ దేవి, 6న శ్రీ అన్నపూర్ణాదేవి, 7న శ్రీమహాలక్ష్మి దేవి, 8న శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి, 9న శ్రీసరస్వతీ దేవి (మూలా నక్షత్రం), 10న శ్రీదుర్గాదేవి (దుర్గాష్టమి), 11న శ్రీమహిషాసురమర్దని దేవి, 12న శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారాల్లో దర్శనమిస్తారని వివరించారు. ఉత్సవాల్లో చివరి రోజు 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి అఖండ హారతులు, రాత్రి 8 గంటలకు శమీ పూజ జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం పోలేరమ్మ, లక్ష్మీ సాయిబాబా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో లక్ష్మీ సాయిబాబా దేవస్థానంలో 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బాబావారి సమాధి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 13న తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం లడ్డూ వేలంపాట అనంతరం గ్రామ దేవత పోలేరమ్మ, శ్రీలక్ష్మీ సాయిబాబా ఊరేగింపు మహోత్సవం జరుగుతాయని వివరించారు. సమావేశంలో కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మాగం ఆత్మారాము, అర్చకులు గంటి సన్యాసరావు, అమ్మవారి సేవకులు రమణమ్మ పాల్గొన్నారు.

వరద బాధితుల సంఖ్యను కుదించడం సరికాదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



బాధితులతో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరదల్లో అపారనష్టం సంభవించిందని, ప్రభుత్వం బాధితుల సంఖ్యను కుదించి పరిమితంగా పరిహారం అందించడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు హితవు పలికారు. బాధితుల గుర్తింపులో లోపభూయిష్టంగా ఉన్న నిబంధనలు మార్చాలన్నారు. ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అజిత్‌సింగ్‌నగర్, న్యూ రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో పర్యటించారు. వరదలో మృతి చెందిన ముఠా కార్మికుడు పోలినాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల పేరుతో యంత్రాంగం వరద బాధితులను నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పండుగకు ముందే బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలెక్టరేట్ కేంద్రంగా ప్రజల ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. వరదలు సంభవించి 29 రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం వరద సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడం సరికాదన్నారు. వరద బాధితుల సహాయంపై ప్రత్యేకంగా యంత్రాంగాన్ని కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి.. కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష చేయాలని కోరారు. అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, బాధితులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సహాయం, విధివిధానాల్లో మార్పులు చేయాలని, ప్రస్తుత ప్రకటించిన సాయం రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. పర్యటనలో సీపీఎం నేతలు బీ.రమణారావు, టి శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో ఇంటర్నేషనల్ వాకర్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్నేషనల్ వాకర్స్ సంస్థ సామాజిక సేవల్లో అగ్రభాగాన ఉందని ఆ సంస్థ అధ్యక్షుడు వి.మురళీకృష్ణ అన్నారు. ఇంటర్నేషనల్ వాకర్స్ 159వ కౌన్సిల్ సమావేశం పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్థ నిర్వహించిన కార్యక్రమాలను, నివేదికను సభకు సమర్పించారు. సభాధ్యక్షునిగా క్లబ్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా పూర్వ సంఘ నేతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వాకర్స్ ప్రముఖులు నాయకులు రావి కృష్ణారావు, తొండేపు హనుమంతరావు, అమర్నాథ్, రామలింగ రాజు, విశ్వేశ్వరరావు, మోటూరు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా కేబినెట్ కార్యదర్శి సూరిబాబు స్వాగతం పలకగా, కోశాధికారి మురళీకృష్ణ వందన సమర్పణ చేశారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

ఘాట్‌రోడ్డులో పాము కలకలం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్ రోడ్డులో ఆదివారం పాము కనిపించడంతో అక్కడ పనులు చేస్తున్న కార్మికులు భయాందోళనలకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఇతర అధికారులు దసరా ఏర్పాట్లను పర్యవేక్షించే సమయంలో పాము కనిపించడంతో ఆలయ సిబ్బంది అప్రమత్తమయ్యారు. కొంత కాలంగా ఘాట్‌రోడ్డులో భక్తుల రాకపోకలు నిలిపివేయడంతో, అభివృద్ధి పనులు జరుగుతుండటంతో కొండపై నుంచి వచ్చి ఉంటుందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

ఐకమత్యంతో జీవించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): హిందూ, ముస్లింలు సోదరభావంతో ఐకమత్యంగా జీవించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పేర్కొన్నారు. ఆదివారం 63వ డివిజన్‌లో సెంట్రల్ యూత్ అధ్యక్షుడుఅన్వర్ బేగ్ ఆధ్వర్యంలో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ప్రశాంత జీవనం గడపాలన్నారు. అనంతరం వాంబే కాలనీకి చెందిన షేక్ సలాంను ఆజాద్ ముస్లిం కమిటీ 60వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, సెంట్రల్ అధ్యక్షుడు అన్వర్ బేగ్, సహాయ కార్యదర్శి సిలార్ బేగ్, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం

పటమట(విజయవాడతూర్పు): ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలని, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా గుండెజబ్బులకు దూరంగా ఉండవచ్చని లీవ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నరసింహారావు పేర్కొన్నారు. పటమట గణపతి సచ్చిదానంద ఆశ్రమం, హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి ఉచితంగా రక్తపరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వారికి ఆరోగ్య అవగాహన కల్పించారు. వారికి ఆరోగ్యం పైన అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. డయాబెటిస్ సంబంధించి షుగర్ పేషంట్లకు రక్త పరీక్షలు చేశారు. కండరాల నొప్పులకు ఫిజియోథెరపీ డాక్టర్లు రోగులను పరీక్షించి తగిన సూచనలు ఇచ్చారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై నగరానికి చెందిన శ్రీకృష్ణవేణి కళానిలయానికి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. సముద్రాల కాంచన బృందానికి చెందిన పలువురు చిన్నారులు పలుకీర్తనలకు నృత్యప్రదర్శన ఇవ్వగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం సభ్యులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

వరద బాధితులకు అండగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరద బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని కరూర్ వైశ్యాబ్యాంక్ వన్‌టౌన్ శాఖ మేనేజర్ పీవీబీ రావు గుప్తా అన్నారు. విజయవాడ హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు వివిధ వస్తువులతో కూడిన కిట్ల పంపిణీని ఆదివారం మెయిన్‌బజార్‌లోని సంఘ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపార వర్గాలకు కేవలం తమ లాభాపేక్ష వ్యాపారాలకు పరిమితం కాకుండా సామాజిక సేవల్లోనూ భాగస్వాములు కావటం చాలా ఆనందంగా ఉందన్నారు. అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు శీరం బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి మనునం కృష్ణారావు మాట్లాడుతూ తమ సంఘం సామాజిక సేవల్లోనూ చురుకుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి దుర్గాసత్యనారాయణ, కోశాధికారి పువ్వాడ తాండవ కిషోర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పంపిణీ చేస్తున్న కేవీబీ బ్యాంక్ మేనేజర్ పీవీబీ గుప్తా

చక్కని తల్లికి చాంగుభళా

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద వార్షికోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు జంగం సిస్టర్స్ పర్యవేక్షణలో చిన్నారులు పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. సంప్రదాయ కీర్తనల్లో భాగంగా చలమేల, సతులారా చూడరే, చక్కని తల్లికి చాంగుభళా, ఇదిగో భద్రాద్రి తదితర కీర్తనలను ఆలపించారు. ముఖ్యఅతిథి ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ప్రేక్షక ఆదరణ ఉన్నప్పుడే కళారూపాలు జీవం పోసుకుంటాయని వివరించారు. చిన్నారులను నృత్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్న జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి కృషిని అభినందించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం అధికారులు వేంకటేశ్వర్లు, వెంపటి శ్రీ సాయి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కమ్ముల శేషకుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు జంగం విజయకుమార్, జంగం చక్రవర్తి చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు.



చురుగ్గా దసరా ఏర్పాట్లు



ఇంద్రకీలాద్రిపై వచ్చే నెల 3వ తేదీ నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులు సేదదీరడానికి చలువపందిళ్లు సిద్ధం చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి వద్ద రక్షణగా ఇనుపమెష్ ఏర్పాటు చేశారు. కనకదుర్గనగర్‌లో అవసరమైన ఏర్పాట్లను సిబ్బంది చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





- **పేకాట శిబిరంపై దాడి**

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పీఎస్ పరిధిలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. కొత్తపేట పోతిన శ్రీనివాసరావు వీధిలో తోట నరేంద్ర ఇంట్లో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడి చేయగా పేకాడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని రూ. 51 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.